కథ 1994

8



# గూడు

## కాట్రగడ్డ దయానంద్

ఈ సంవత్సరం మబ్బులు బాగా అదనులో వచ్చిపడ్డాయి. భూమి తల్లి పదను అయేట్లు మోయినంగా కురిసిపోయింది వాన. వానలు పడినప్పుడు సలిమిడి ముద్దలా అయి నాలుగు ఎండలు కాసేటప్పటికి నేలనేలంతా కొత్త కాగితంలా పెళపెళ లాడింది.

ఈ మూడు నెలలూ తీరిగ్గా కూర్చున్న రైతులందరూ కోలాహలంగా ఎవరి పనుల్లో వాళ్లు పడ్డారు. మూడునెల్ల విరామం అనంతరం మళ్లీ నిరంతర శ్రమలోకి దిగేరు రైతులు. విత్తనపు గింజలు సిద్ధం చేసుకుని ఎరువు కువ్వలు జల్లేరు. అరకలు కట్టేరు.

చ్చేచ్చే... డుర్... చ్చే చ్చే... డుర్...

వెంకటేశ్వర్లు ఒక్క నిమిషం అరకను ఆపి నిల్చుని చుట్టూ చూసేడు. పొలాల్లో కొందరు చద్దన్నాలు తింటున్నారు. కొందరు అరకలు ఆపి చెట్ల క్రింద సేద తీరుతున్నారు. ఊరి బాటవైపు పరికించేడు. దూరాన నెత్తిమీద సద్ది దుత్తల్ని పెట్టుకొని ముగ్గురు నలుగురు ఆడవాళ్లు కదిలి రావటం లీలగా కనబడింది.

తలగుడ్డ తీసి విదిలించి మళ్లీ చుట్టుకొన్నాడు. పైన కరకరలాడుతున్న ఎండని చూచేడు. మళ్లీ ఎద్దుల్ని అదిలించేడు. మువ్వల శబ్దంతో కదిలేయవి. నేల పాయలు పాయలుగా చీలి పుస్తకంలోని పేజీలు తెరుచుకున్నట్లుగా విడిపోతుంది. అరక వెనకే రెండు మూడు కొంగలు మెడల్ని చిత్రంగా కదిలిస్తూ పురుగుల్ని ఏరుకుంటూ కదులుతున్నాయి. జెముడు కాకి ఒకటి ఆ చివర గట్టు వెంట పురుగుల కోసం వెంపర్లాడుతూ కలియతిరుగుతోంది.

నడుస్తున్న ఆడవాళ్లు చేరువ అయేరు. వెంకటేశ్వరు భార్య సుజాత చేలోకి నడిచి కుంట ఒడ్డున జమ్మి చెట్టు క్రింద నెత్తిమీంచి అన్నం గిన్నెల్ని దింపింది. ఆమె తోడికోడలు రమణమ్మ ఇంకో ఇద్దరూ వీళ్లను దాటుకుని వెళ్లిపోయేరు.

"రాయ్యా! పొద్దెక్కింది," అంది సుజాత. వెంకటేశ్వరు అరక ఆపి ఆమె వేపు తీక్షణంగా చూసేడు.

"పొద్దెక్కిన సంగతి తెలుస్తానే ఉంది. ఒకళ్లకు నలుగురాడోలుండి సద్దికూడు తేడానికి నడిజామైంది. ఏం ఉద్ధరిస్తున్నారే ఇళ్లకాడ," గట్టిగా అరిచేడు వెంకటేశ్వర్లు.

సుజాత ఏమి సమాధానం ఇవ్వకుండా గిన్నెలో చింతకాయపచ్చడి అన్నం కలుపుతోంది. వెంకటేశ్వర్లు కుంటలోకి దిగి కాళ్లు చేతులు ముఖం కడుక్కుని కండువాతో తుడుచుకుంటూ చెట్టు క్రిందకు చేరేడు. వాళ్లిద్దరికి జమ్మిచెట్టు నీడ చాలీ చాలకుండా పంచుతోంది. ఇంతకు ముందు అక్కడో గంగిరేగు చెట్టుండేది. పొలం పన్లకని బండి చేయించడానికని ఉన్న నీడను కొట్టివేశారు. అది మొన్నటి వానలకు చిగురిస్తోంది.

వెంకటేశ్వర్లు రెండు చేతులూపి చాపి దోసిలిపట్టి ఒక పెద్ద ముద్దను అందుకున్నాడు. మజ్జిగన్నం కూడా దోసిలితో తాగి చుట్ట చుట్టడంలో మునిగిపోయేడు. ఎద్దులు రెండూ నెమరు వేస్తున్నాయి. దాపటి ఎద్దు మెడ మీద కాడితోనే క్రింద కూలబడింది. పొలాలన్నీ చదరంగా నల్లగా నిగనిగలాడుతున్నాయి.

''ఎందుకంత లావునరుస్తావ్! మీ అమ్మ ఇయ్యాల పొద్దెక్కిందాక మంచం దిగల. ఒకామెకు నీళ్ల

పని, ఇంకోకామెకు వంటపని, నాకేమో పిల్లల్ని సముదాయించి, బఱ్ఱెగొడ్లకాడ బాగుచేసి తెమిలి వచ్చేసరికి ఈవేళైంది,'' సుజాత భర్తను చూసూ అంది.

''అవుద్దే! ఏవేలైనా అవుద్ది. తోటోళ్లు ఎప్పుడు సద్ది తాగేరు, నేనెప్పుడు తాగేను. అంటేనేమో అంత లావున రోషం,'' కోపంగా అన్నాడు వెంకటేశ్వర్లు.

''నిజమేనయ్యా! సద్దికూటి కాలిసమైతే ఆగలేవని నాకూ తెలుసు. అయితే ఏం చెయ్యమంటావ్? తోటోల్లకేం? ఎవరి సంసారాలు వాళ్లవి. మన్లాగ ఇంకా కలసి కాపరాలు వెలగబెడుతున్న వాళ్లను చూపించు ఊళ్లో?'' అంత తీవ్రంగా నిలదీసింది సుజాత.

వెంకటేశ్వరు చుట్ట నోట్లో పెట్టుకుని వెలిగించేడు.

''వేరు కాపురం పెట్టి చూడు. నీకు మాత్రం వాళ్లతో పాటు సద్దికూడు ఎట్టారాదో సూద్దువుగాని,'' తనే పొడిగిస్తూ అంది సుజాత.

''సంవత్సరం నుంచి చూస్తున్నాను. ఊ అంటే నీకిదే పాట. నలుగురు కల్సుంటే ఉండే ఆనందం నీకు తెలవడం లేదే,'' అన్నాడు వెంకటేశ్వరుల్లు. నేలమీద గడ్డిపైన కండువా పరచి నడుం వాల్చుతూ.

''అవును. ఇదిగో ఇదే ఆనందం సూస్తున్నాంగా! పొద్దస్తమానం చాకిరీ చేస్తే పచ్చడి ముద్ద గూడా వేళకు గతి లేకుండా ఉంది. నిరుడు నీ అన్న కూతురు సమర్తాడితే అప్పు చేసి అదో అయిదువేలు ఖర్చు. మీ అమ్మ ఈ ఏడు ఇంకో పాతికో, ముప్పాతికో పెట్టి ఆ పిల్లకు పెళ్లి చేసే ఆలోచనలో కూడా ఉంది. ఎట్టయినా పెద్ద మనవరాలుగదా! ఇయ్యన్నీ సూత్తానే ఉండు. మన పిల్లలు ఎక్కొచ్చేసరికి చిప్ప చేతికి వచ్చుద్ది,'' కోపంగా అంది సుజాత.

''చస్! నోర్మూయ్యి దరిద్రం! కదిలిస్తే చాలు కమురు గబ్బు లేపుతావు,'' అన్నాడు వెంకటేశ్వర్లు.

''నువ్వెందుకయ్యా నన్ను కదిలించడం గబ్బు కొట్టించుకోవడం. రేవు నీ కొడుకులు పెద్దయితే తెలుసుద్దిలే. అవతలేమో నీ తమ్ముడూ, మరదలేమో ఇళ్లు కదలరు. ఇవతల నీ అన్నగారి పిల్లలు ఎక్కివస్తుంటే వాళ్ల ముద్దూ ముచ్చటలు బాగానే తీరతాయి. ఇయ్యాల పంచుకున్నా తలా పదివేలకు తగ్గకుండా అప్పు మిగులుద్దా లేదా? పొద్దస్తమానం రెక్కలు ముక్కలు చేసుకున్నా రైకగుడ్డ కావాలన్నా మీ అమ్మ కొట్టుకు పోయి తేవాల్సిందే. ఇంట్లో పాలే కదా అని పుట్టింట్లో అలవాటు చొప్పన ఎప్పుడన్నా ఒక కప్పుడు కాఫీ పెట్టుకుని తాగితే పిల్లలకియ్య లేదని ముసలమ్మ తగువులాట పెట్టుకునే! ఏం బతుకో ఏమో? ఒక పండగా లేదు. ఒక సినిమా లేదు. అదేం చోద్యమో, ముసలామెకు ఇంకా పెత్తనం మీద మోజు తీరక పోయె? ఇంట్లో మొగుడు పెళ్లాలు కలుసుకోవాలన్నా ఆమె సలహానే అయితే ఎట్ట? నిన్ను సూత్తేనేమో పెళ్లాం మాట ముచ్చట పట్టకుండా ఉంటివి!'' ఏడుపు గొంతుతో తనేం మాట్లాడుతుందో తనకే తెలియకుండా కలగాపులగంగా మాట్లాడుతోంది సుజాత.

''అబ్బబ్బా కాసేపన్నా యిశ్రాంతిగా కూర్చోనియ్యవుగదే. ఎప్పుడు చూచినా ఏడుపు మొహం నువ్వు! అయితే ఏంది నువ్వనేది?''

''రామాయణమంతా ఇని సీతేమవుద్ది అన్న సామెతగా ఉంది నీ యవ్వారం. నువ్వట్టనే సూత్తా వుండు. పెళ్లిళ్లకనీ పురుళ్లకనీ అప్పు పెరిగిపోయిద్ది. నా బిడ్డలు దున్నుకుని బతకడానికి కాస్తంత మడిచెక్క గూడా మిగలదు. నువ్విట్టనే ఏమీ పట్టకుండా ఉండు. ఈసారి కుప్పలప్పుడైనా వేరుపడకపోతే నేనూ నా బిడ్డలు ఇంత ఎండ్రిన్ తాగి సస్తాం,'' ఏడుస్తూ బెదిరించింది సుజాత.

''ఇదెక్కడి గోలే నీది! నిద్దర లేచిన కాడ నుంచి వేరుపడే రంధి తప్ప ఇంకేం ఉండదు కదా!'' అని లేచి క్రిందున్న కండువా తీసి విదిలించి తలగుడ్డ చుట్టేడు.

దూరాన కనకమ్మ బఱ్ఱెగొడ్లను తోలుకు వస్తూ కనబడింది అతనికి. అరకకాడికి పోయేవాడల్లా చేరువకు వచ్చేదాకా ఆగాడు. సుజాత ఆమెను చూచి కళ్లనీళ్లు తుడుచుకుంది. కనకమ్మ బఱ్ఱెగొడ్లను నిలేసి ఒకసారి పొలంవైపు తేరిపార చూచి, ''ఎగదాల చేను కూడ అరక రేపటికి అయిద్దేమోరా! అరక ఇప్పినాక సొసైటీలో ఎరువులిస్తామన్నారు. తెచ్చి ఇంటికాడ వెయ్యి,'' అందామె.

''ఏస్తాగాని బాగా లేకుండా పొలమెందుకే రావడం. ఆ కాలు వాపు తగ్గకుండానే పరుగెత్తుకొచ్చేవెందుకు. నాలుగు రోజులు కదలకుండా ఇంట్లో వుంటే నన్నా తగ్గేదేమో. పంతులు మందులికి తగ్గకపోతె ఒంగోలు పోయి చూయించుకోకూడదూ,'' అన్నాడు వెంకటేశ్వర్లు.

''సర్లేరా! పనుల రోజుల్లో కూర్చుని తింటానికి మనకెట్టా కుదురుద్ది చెప్పు. ఎరువుల సంగతి మర్చిపోబాకు. పాలుమాలితే అయిపోయినాయంటారు,'' అంటూ కదిలింది కనకమ్మ.

వెంకటేశ్వర్లు పడుకున్న ఎద్దుని లేపి అరకను కదిలించేడు. సుజాత బఱ్ఱెగొడ్లకు గడ్డి దోకటానికి దోకుడు పార తీసుకుని గట్టు మీదకి నడిచింది.

*

కనకమ్మకు ముగ్గురు కొడుకులు, ఒక్క కూతురునూ, కూతుర్ని ఊళ్లోనే ఇచ్చింది. మూడోవాడి పుట్టకలప్పుడే పెనిమిటి దిక్కుమాలిన రోగమొచ్చి నెలరోజులు మంచంలోనే ఉండి పోయేడు. ఆ నెల రోజులూ పెనిమిటి మంచాన్నే అంటిపెట్టుకుని తిరిగిం దామె. గొడ్డు, గోదా, పిల్లా, జెల్లా సర్వమూ మర్చిపోయిం దామె. వేళకు తిండి కలిపి ముద్దలు నోటికందించింది. ఒంటేలుకు బొచ్చె పట్టింది. ముడ్డి కడిగింది. మనిషి మంచం దిగకపోయినా వేడినీటితో పూటపూటా ఒళ్లు తుడిచి ఎంతో శుభ్రంగా ఉంచింది.

ఆయన కన్నీళ్లు కార్చి కార్చి వెళ్లిపోయేడు. గర్భిణీతో ఉండే ఇవన్నీ చేసిందామె. ఆయన పోయాక పిల్లల్ని దగ్గరకు తీసుకుంది. కర్తవ్యం గుర్తు చేసుకుంది. ఎంతోమంది అవకాశం ఉంది గదా అని దగ్గరకు చేరాలని, చేరదీసి చేరువ కావాలని చూచేరు. అందర్నీ నవ్వుతూనే తిరస్కరించింది. కోరికలన్నీ వ్యాపకాలతోనే విరిచేసింది. నిప్పులాంటి కనకమ్మ అనిపించుకుంది లోకంచేత.

నాగలి కట్టింది. పొలం దున్నింది. పైరులేసింది. కుప్పలు తొక్కిచ్చింది. బండి తోలింది. మగాడి పను లన్నీ ఆడవాళ్లు కూడా అవలీలగా చేయగలరని చేసి చూపించింది. నాలుగెకరాలు పొలాన్ని తన పిల్లల కోసం సంపాదించింది. అలాగని ఆమెకు దిగుల్లేదని అను కుంటే అది పొరపాటే.

కూతురు పెద్దది కాగానే పెళ్లి చేసి పంపింది. పెద్ద కొడుకులిద్దరకూ పెళ్లి చేసింది. పెద్దవాడికి ఇద్దరు కూతుర్లు. రెండోవాడికి ఇద్దరు కొడుకులు. మూడో వాడికే పిల్లల్లేరు. ఆమె దిగులంతా వాడిదే.

వాడు పుట్టడమే అర్భకుడిగా పుట్టేడు. తెలివి తేటల్లేవు. మాట తడబాటు ఎక్కువ. చిన్న చెవులతో పెద్ద ముఖంతో పుట్టటమే వికారంగా పుట్టేడు. తినట మేందో, తిరగటమేందో వాడు అంతే! పని పాటలేం తెలియవు. పెళ్లి వయసొచ్చేవరకూ తనకేం పట్టనట్టుగా ఊరంతా చెడతిరిగేడు. వేళకు పెట్టిందేదో తినేవాడు. కొన్నాళ్లకు పెళ్లి చేయమని గొడవ మొదలుపెట్టాడు. అందరూ వాడి మాటల్ని అంతగా పట్టించుకోలేదు. విని ఊరుకునేవాళ్లు. వాడు మాటలతోనే ఆగలేదు. ఆడ పిల్లలు కనిపిస్తే వెర్రిగా ప్రవర్తించడం మొదలుపెట్టేడు. ఊళ్లో ఒకటి రెండుసార్లు పట్టుకుని వాడి ఉన్మాదం తగ్గేదాకా కట్టిపడేసేరు. వాడు అర్భకుడైనందుకే ఆమె బాధపడింది. దానికితోడు వాడి ప్రవర్తనతో ఆమె మరింత కలత చెందింది.

పెళ్లి చేయమని గొడవ పెట్టుకుని అలిగి ఒకసారి ఇంట్లోంచి వెళ్లిపోయి ఎక్కడో దూరపు చుట్టాల ఊళ్లో తేలేడు. పదిరోజుల తర్వాత ఆ ఊరు నుంచి కబురు వస్తే పోయి తీసుకొచ్చేరు. ఆ పదిరోజులు కనకమ్మ చుట్టుపక్కల తిరగని ఊరులేదు. అడగని పస్తీ లేదు. పస్తీ అడిగితే పెళ్లి చేయమని, చేస్తే బాగుపడతాడనీ చెప్పేరు.

వాడు అలా వెళ్లి వచ్చేక కనకమ్మ పెద్దవాళ్లిద్దరితో వాడి పెళ్లి సంగతి ప్రస్తావించింది. వాళ్లు ఒప్పుకోలేదు. 'తానడవలేడు కాని మెడకో బండా,' అన్నారు కొడళ్లు. కనకమ్మకు కూడా అది సబబేననిపించింది. ఆ ఆలోచనను విరమించుకుంది.

రోజురోజుకు వాడి పిచ్చిచేష్టలు ఎక్కువయ్యేయి. కొడుకుని చూస్తుంటే ఆమె గుండె తరుక్కుపోతుంది. ఒకరోజు పెళ్లి చేయటం లేదని నానా భీభత్సం చేసి ఎండ్రిన్ తాగేడు వాడు. బతికి బయటపడేసరికి రెండువేలు వదిలేయి.

కనకమ్మ మళ్లీ ఆలోచనల్లో పడింది. పెళ్లి చేయకపోతే వాడు తనకు దక్కడని తలచింది. నలుగురు కూతుర్లతో గుంజాటన పడుతున్న తన అన్న దగ్గరకు వెళ్లి కాళ్లావేళ్లా పడింది. ప్రలోభ పెట్టింది. వాళ్లని ఒప్పించింది. ఎనిమిదో తరగతి చదువుతున్న మేన కోడలితో పెళ్లి జరిపించింది. పసివయస్సుదా పిల్ల, పొలం పనులు అంతగా తెలీవు. ఎట్టానో వాడితో సర్దుకు పోతుంది. చిన్నపిల్ల కదా కనకమ్మ కూడా బాగానే చూసు కొనేది.

ఆ పిల్ల కాపరానికి వచ్చిన దగ్గర్నుంచి తోడి కోడళ్లిద్దరూ పనుల్లో వంతులు పెట్టుకోవడం ప్రారం భించేరు. అయిన పిల్ల కదా అత్త ఆ పిల్లకు అరటి ఆకుల్లోనే పెడుతుందని చాటుగా అనుకునేవాళ్లు. అప్పడప్పుడు కనకమ్మ చెవుల్లో ఈ మాటలు పడినా ఆమె విననట్లు ఊరుకునేది. కొడుకులు తన మాట జవదాటరని ఆమెకు గొప్ప నమ్మకం. వాళ్లే నా చేతుల్లో ఉంటే కోడళ్లదేముందిలే అన్నది ఆమె ధీమా!

పెద్ద కోడళ్లిద్దరకూ వేరు పడాలనుందని మొద ట్నుంచి ఆమెకు తెల్సు, అది తెలియనట్లుగా ఆ

ప్రస్తావనే రాకుండా జాగ్రత్తపడుతూ సంసారాన్ని గుట్టుగా నడిపిస్తోందామె. వేరుపడితే చిన్నాడి గతి ఏమిటన్నదే ఆమె బాధంతాను. తను బతికి ఉన్నన్నాళ్లు అందర్నీ కలిపి ఉంచగలిగితే తరువాత ఏమవుతారో ఎట్టవుతారో ఆ భారమంతా భగవంతునిదే కదా అనుకుందామె.

*

కుప్ప నూర్పిళ్ల రోజులొచ్చేయి. అప్పటివరకూ పంట చూరుకింద తలదాచుకున్న భూమి ఎండ బాధ తట్టుకోలేక విలవిలలాడుతోంది. ఎక్కడి పంటలక్కడ కోసి కుప్పలు పడ్డాయి. రైతులందరూ కల్సి కట్టగా కుప్పల్ని తొక్కించుకుంటున్నారు.

ఆ ఏడు పంట కూడా బాగా పండింది. ఈ సంవత్సరమే మనవరాలి పెళ్లి చేయాలన్నది కనకమ్మ ఆలోచన. వెంకటేశ్వర్లు ఆలోచన అందుకు భిన్నగా వుంది.

సుజాత చెప్పింది అతనికిప్పుడు సబబుగా అనిపిస్తోంది. ఆమె వాదనలో అతనికిప్పుడు నిజాలు కనబడుతున్నాయి. తల్లి ప్రవర్తన చాదస్తంగా కూడా అనిపిస్తోంది. నిజమే! తన కొడుకులు ఎదిగి వచ్చేసరికి అప్పులు తప్ప ఆస్తి మిగలదేమోనన్న భయం పట్టుకుంది. వాళ్లను బాగా చదివించుకోవాలని వాళ్లు తనలాగ ఎద్దుముడ్డి పొడుచుకునే వాళ్లు కాకూడదని పట్టుదల పెరిగింది. పంచుకుంటే తలా నాలుగెకరాలు వస్తుంది. ఇంకో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని ఇదే చాకిరీ చేసుకుంటే తను, తన పిల్లలు మారాజులాగా బతకొచ్చు. ఇప్పుడైతే తలా పదివేలు అప్పు వస్తుందేమో! ఇంకొన్నాళ్లపోతే అప్పే పంచుకుంటానో, ఆస్తి పంచుకుంటానో ముందు, ముందు ఎలా ఉంటుందో పరిస్థితి. ఇది అతని ఆలోచన.

రేపు కుప్ప తొక్కిస్తారనగా ఆరోజు రాత్రి అందరూ అన్నాలు తిని కూర్చున్నాక తల్లితో అన్నాడు వెంకటేశ్వర్లు.

"అమ్మా! ఈ ఏడన్నా మేము ఎవుల్ల గెంజి వాళ్లం కాచుకుంటామే," అన్నాడు నాన్చుడుగా!

ఆ మాటకే ఉలిక్కిపడింది కనకమ్మ. చిన్న కొడుకుని తల్చుకుని ఆపాదమస్తకం వణికింది. పెద్ద కొడుకు ఏ భావం లేకుండా  మంచమ్మీద కూర్చుని ఉన్నాడు. చిన్నకోడలు చదువుతున్న పుస్తకం ప్రక్కన పెట్టి నిర్ఘాంతపోయి కూర్చుంది.

కనకమ్మ తేరుకుని, "ఇది నీ పుర్రెకు పుట్టిన బుద్దేనంట్రా?" అని సుజాతను అనుమానంగా చూచింది.

"ఇప్పుడు నీకూ నీ పిల్లలకు ఏం తక్కువైందని నీ ఆలోచన? వేరుపడి ఊరక కూర్చుంటే నీ పెళ్లాం తెచ్చిపెట్టద్దా ఏం నీకు తిండి?" అని కటువుగా నిలదీసింది కనకమ్మ.

"మధ్యలో నా ప్రస్తావనెందుకట? కొడుకూ తల్లి క్రిందా మీద పడక," గొణుక్కుంటూ అవతలకు వెళ్లింది సుజాత.

కనకమ్మ వ్యవహారాన్ని సాగదీయదలచుకోలేదు. నలుగుర్లో నానకుండా అన్ని వ్యవహారాలాగే దీన్ని వెళ్లదీయాలని ఆలోచించింది.

"ఒరే పెద్దోడా ఇన్నావురా?" అందామె.

"వినేదేముందమ్మా నువ్వెంత చెబితే అంత. ఇయ్యాల నేను వేరుపడతానంటే పెళ్లాం మాటలు విన్నాడని ఎదవని నువ్వే అంటావు. వద్దంటే ఉమ్మడిగా ఉండి ఆడపిల్లల అచ్చటా ముచ్చటలు తీర్చి నా పిల్లల్ని అన్యాయం చేసేడని తమ్ముడంటాడు. ఏం చెప్పినా కష్టమే. ఇక మీ ఇష్టం," అన్నాడు పెద్దకొడుకు.

పెద్దకోడలి వైపు చూచింది కనకమ్మ. ఆమె తలవంచుకుని లోపలకు పోయింది.

"సరేరా! అట్టయితే ఆస్తిని కాదు. నన్ను మూడు బాగాలుగా వేసుకోండి," అందామె కోపంగా.

"అమ్మా! నువ్వెన్నయినా చెప్పు! ఈ సంవత్సరం వేరు పడాల్సిందే," వెంకటేశ్వర్లు కూడా అంతే తీవ్రంగా అని బయటకు వెళ్లిపోయేడు.

అంతటితో వదలకుండా ఆరోజు రాత్రి పెద్ద మనుషుల్ని నలుగుర్ని తీసుకొచ్చేడు ఇంటికి వెంకటేశ్వర్లు- వాళ్లు కనకమ్మకు నచ్చచెప్పబోయేరు. వాళ్లు తన గుమ్మం తొక్కటానికే వీల్లేదని శాసించింది. నా ఆస్తి నా యిష్టం మధ్యలో పంచటానికి మీరెవరని వాళ్లని నిలేసింది. బయట నుంచి బయటనే తరిమింది వాళ్లను.

ఆ రాత్రి పిల్లలు తప్ప ఆ ఇంట్లో పెద్దవాళ్లెవరూ నిద్రపోలేదు. కనకమ్మ రాత్రంతా ఆలోచనల్లోనే గడిపింది. ఈ గొడవ ఇంతటితో పోదనుకుందామె. ఊర్లో నలుగురి నోళ్లలో నానటం, చులకన కావటం ఇష్టం లేదామెకు.

మరుసటి రోజు ధనియాల కుప్పను తొక్కించేరు. తూర్పారబట్టేరు. ఏమనుకుందో ఏమో ముగ్గురు కొడుకులకూ మూడు భాగాలు కొలిచింది గింజల్ని. ఇల్లు తప్ప ఆస్తినంతా పంచింది. నాలుగు భాగాలేసి తనకో భాగం తీసుకుంది. పేచి పెట్టకుండా ఆమె ఏది

ఇస్తే అది తీసుకున్నారు కొడుకులు. మంచిరోజుల్లేవని ఇల్లు మాత్రం పంచలేదు.

ఒక గాలికెరటం విసురుగా వీచింది. వేపచెట్టు శిరస్సు జివ్వున వణికింది. ఆకాశాన సగం చంద్రుడు ఆకారం కూడా పోల్చలేని దిష్టిబొమ్మలాగా ఉన్నాడు. కప్పలు, కీచురాళ్లు కల్సి రాత్రి వాతావరణంలో ఒక నిరామయ సంగీత కచేరి నిర్వహిస్తున్నాయి.

వేపచెట్టుకు కట్టేసిన ఎద్దుల మెడలోని మువ్వల గంటల శబ్దం అవి నములున్న చొప్పదంటుల పరపర శబ్దంలో కల్సి వింతగా వినబడుతోంది. వేపచెట్టుకు కాస్త అవతలగా ఉన్న ఆ ఒంటినిట్రాడు పెంకుటిల్లు వెన్నెల్లో ఒక పురాతన మాంత్రికుడి గుహలా వెలుగుతోంది. ఇంటి ముందు పందిరి కింద వేసుకున్న మంచాల్లో అందరూ ఆదమరిచి నిద్రిస్తున్నారు ఒక్క కనకమ్మ తప్ప.

కనకమ్మ మంచం మీంచి లేచి కూర్చుని చుట్టూ మంచాల మీద చూచింది.అందరూ నిద్రలో ఉన్నారు. కొందరు ప్రశాంతంగా, కొందరు గురకతోనూ నిద్రిస్తు న్నారు. తెల్లటి జుట్టూ, ఇప్పుడిప్పుడే వంగిపోతున్న నడుమూ, కొద్దికొద్దిగా ముడుతలు పడ్డ దేహమూ... ఆమె మాంత్రికుడు పట్టి బంధించి తెచ్చిన రాజకుమారు లకు కాపలా కాస్తున్న ముసలి శిష్యురాలుగా అనిపి స్తోంది ఆ గుడ్డి వెన్నెల్లో.

కనకమ్మ మంచం కిందికి వంగి తన చేతికర్రను అందుకుని లేచి నిలబడింది. పంచలో గోడవార ఉంచిన కర్రను తీసుకుంది. మెల్లిగా నడుస్తూ వేప చెట్టుకు అవతలగా ఉన్న పంచాయితీ మిద్దె పక్కకి వెళ్లింది. అప్పటిదాకా ఏం చేసిందోగాని ఒక మచ్చల పిల్లి ఆ మిద్దె కిటికీలోంచి బయటకు దూకింది. ఉలిక్కి పడిందామె.

''నీ మొదులార భయపెట్టేవు కదే,'' పారిపోయిన పిల్లివైపు కర్రతో ఆడిస్తూ అంది. మెల్లిగా మంచం దగ్గరకు వెళ్లి కూర్చుని పక్క కింది పుగాకు కాడను బయటకు తీసింది. దాన్ని పాయలు పాయలుగా వలిచి నడిమి కాడను చీల్చి చుట్ట చుట్టింది. నోట్లో పెట్టుకుని చుట్ట చివర కొరికి ఊసింది. మంచం అవతలగా పడుకున్న పెద్ద కొడుకుని కర్రతో తట్టి, ''ఒరే పెద్దోడా! లే! లెగు. గొడ్లకు కాస్త మేతెయ్యి,'' అంది. వాడు ఆవులిస్తూ పైకి లేచి వామివైపు నడిచి చొప్పదంటు దూసి కత్తెర కింద వేసి తెగొట్టి ఎద్దులకు వేసేడు. ఇంకాస్త బఱ్ఱెగొడ్లకు విదిలించేడు.

''ఒరే! ఆ పొయ్యిలో నిప్పుందేమో ఇటుతేరా!'' అంది కనకమ్మ. వాడు పొయ్యిలోని బూడిదలో వెదికి వెదికి ఒక నిప్పురవ్వను పాత సిల్వరు గంటెలో వేసుకుని బూడిద ఊదుతూ తీసుకొచ్చేడు.

ఆమె ''ఒప్పు! బక్ బక్'' మని చివర నలుపుతూ చుట్ట వెలిగించుకుంది.

''ఒసే రమిణీ! లే!'' అంటూ పిల్లల పక్కన పడుకున్న పెద్దకోడలు రమణమ్మను లేపిందామె. ఆమె లేచి జారిపోయిన జుట్టు ముడిని వేసుకున్నాక, ''ఇదిగో తాళం చెవి తీసుకుపో,'' అంది.

అది తీసుకుని ఇంటి తలుపు తీసింది కోడలు. వెనకే పెద్దకొడుకూ ఇంట్లోకి చేరి తలుపేసుకున్నారు. మధ్య నిట్రాడు నుంచి నాలుగు వైపులకు విస్తరించి ఉంది ఆ ఇల్లు. ఒక్కటే గది అయినా విశాలంగా వుంది. ఇంట్లో ఒక పక్కన ఒకదాని మీదుగా ఒకటి ధాన్యం బస్తాలు వేసి ఉన్నాయి. ఇంకో పక్కన భోషాణం పెట్టె, పాతగుడ్డల మైలపెట్టె, వేలాడుతున్న దండెమూ, కింద ఒక మూలగా దొర్లాడుతున్న గిన్నెలూ, చెంబులూ, ఇంకోపక్క ఒకే ఒక్క మంచమూ వేసి ఉన్నాయి.

బయట ముసలమ్మకు కుడివైపు మంచమ్మీద రెండో కొడుకు వెంకటేశ్వర్లూ వాడి కొడుకూ, ఆ పక్క మంచమ్మీద వాడి పెళ్లాం సుజాతా ఇంకో కొడుకూ పడుకుని ఉన్నారు. ఎడమ పక్క మంచాల మీద ముసలమ్మ చిన్న కొడుకూ, కోడలూ, పెద్ద కొడుకు కూతురూ పడుకుని ఉన్నారు.

ఆ మంచాలకవతలగా పాటిమట్టి తోలి ఉంది. ఆ ఇంటి గోడకానించి కొత్తగా అల్లిన వెదురు తడికెలు నిలబెట్టి ఉన్నాయి.

ముసలమ్మ చుట్ట పొగను బయటకు వదుల్తూ వాటి వైపు చూచి నిటూర్చింది.

తెల్లారితే ముగ్గురు కొడుకులూ కల్సి ఆ ఇంటిని మూడు ముక్కలు చేసి పంచుకుంటారు. నిన్నటి నుంచి కనకమ్మ కంటి మీద కునుకు లేకుండా ఉంటోంది. తనూ తన పెనిమిటీ కల్సి రాత్రింపగళ్లూ తేడా తెలీ కుండా కూలివాడి అవసరమే రాకుండా మట్టి తోలి, పిసికి కష్టం చేసి అపురూపంగా కట్టుకున్న ఇల్లది. కప్పుకు వెయ్యటానికి చెట్టెక్కి వేపాకుని కోసింది. వెదురు బొంగుల్ని పెండేలుగా చీల్చింది. ఇల్లు కప్పు తున్న పెనిమిటికి పెంకులు అందించింది. గోడల క్కావాల్సిన ఇటుకల్ని తనే స్వయంగా బట్టీ పెట్టి కాల్చింది. అటువంటి ఇంటిని తన కళ్లముందే మూడు ముక్కలు చేయటాన్ని ఊహించలేకపోతోందామె.

ఎక్కడో కుక్క బొంగురు గొంతుతో అరుస్తోంది. రోడ్డు మీద కదిలి వెడుతున్న బండి గీరల శబ్దం గరగరా వినబడుతోంది. తల్లిపాలు చాలని పిల్లవాడి ఏడుపు ఎక్కడి నుంచో బయల్దేరి ఆ ఊరి రాత్రిని ఒక్క కుదుపు కుదుపుతోంది.

ఎప్పుడొచ్చి పడుకున్నారో పెద్ద కొడుకూ, కోడలు. వాళ్ల వాళ్ల మంచాల మీదకి చేరేరు. కనకమ్మ తన మంచం మీద తడిమి తాళం చెవి చేతికి తీసుకుని రెండో కోడలిని లేపింది.

"అమ్మాయి సుజాతా! లేచి కాసిని మంచినీళ్లి య్యమ్మా నాకు," అంది కోడల్ని కర్రతో తట్టి. లేచి రోజులానే అత్తను చురచురా చూచి తాళం చెవి అందు కుంది. చెంబునిండా మంచినీళ్లు తెచ్చి ముసలమ్మ మంచం కింద పెట్టింది. ఆమె మొగుడు మంచం దగ్గరకు వెళ్లి మెల్లిగా అతడ్ని తట్టింది. వాడు నిద్ర మత్తులో అటు తిరిగి పడుకున్నాడు. మళ్లీ కుదిపింది. "పడుకో గమ్మున" అని విసుక్కున్నాడు వాడు. సుజాత తన మంచం మీదకు చేరిన క్షణాల్లోనే నిద్రలోకి జారు కుంది.

కనకమ్మ ఇదంతా ఓరకంట గమనిస్తూనే ఉంది. సుజాత చురచుర చూపుల్లో ఆమె చాలా రోజుల్నుంచి చాలా అర్థాల్నే గమనిస్తూంది. మొగుడూ పెళ్లాలు కలుసుకునే దగ్గర కూడా నీ పెత్తనమేంది మధ్యలో అన్న చూపుంది. ఒక స్వేచ్ఛను కోల్పోయిన అసహనమూ, చూస్తుండు ఎప్పడో అగ్నిపర్వతమై పేలతాను అన్న హెచ్చరిక కూడా ధ్వనిస్తూంది ఆమెకు ఆ చూపుల్లో.

అప్పటికీ ఒకటి రెండుసార్లు, "అత్తా రాత్రులు హాయిగా నిద్రపోక మెలకువతో ఉంటావెందుకు," అని సుజాత పరోక్షంగా అడిగితే, "పిల్లా! నా బాధ నీకు తెలవదులేవే," అని కనకమ్మ కొట్టి పారేసేది. సుజాత ప్రవర్తనను అతి తెలివిగా అంచనా వేసిందామె.

పెద్దకొడుకు పెళ్లి చేశాక వాళ్లు రోజూ ఇంట్లోనే పడుకునేవాళ్లు. రెండో వాడి పెళ్లి చేశాక కనకమ్మకు దిగులు కమ్ముకొచ్చింది. ఉన్నదా వేరు గదిలేని ఇల్లాయె! అప్పట్నుంచి ఆమెకు పెద్ద ఇల్లు కట్టలేక పోయాననే బాధ మనసులో ప్రవేశించింది. అట్లని తాహతుకు మించి అప్పులు చేసి ఇల్లు కట్టదలచుకోలే దామె. అప్పటి నుంచి రోజూ రాత్రులు ఇదే దినచర్య అయింది ఆమెకు. వానొచ్చినా వరదొచ్చినా వెన్నెల కురిసినా, చీకటి ముసిరినా కొడుకూ కోడళ్లకు ఇలానే ఏకాంతం కల్పిస్తుందామె.

ఏకాంతం కోసం అల్లాడిపోయే ఎన్నో జంటల్ని తన చిన్నతనాన్నించి ఎన్నిటినో చూచింది ఆమె. ఎక్కడా కలుసుకునే వీలు చిక్కక పంటచేలల్లో గడ్డివాముల్లో ఆఖరుకు గొడ్లకొష్టాల్లోనూ ఏకాంతం వెదుక్కునే జంటల్ని చూచింది. రోజుల తరబడి కలుసుకోటానికి వీలు చిక్కని జంటలున్న కుటుంబాల్ని ఎన్నిటినో చూచింది. ఆ గతి తన పిల్లలకు పట్టకూడదనీ, ఊళ్లో నలుగుర్లోనూ తన కుటుంబం వెలితి కాకూడదనే ఆమె తాపత్రయమంతా. ఆమె తన పిల్లలపట్ల చాలా బాధ్యత గా వ్యవహరిస్తున్నానని అనుకొంటుందే తప్ప అసహ జంగా, యాంత్రికంగా, నిర్బంధంగా భావిస్తున్న సుజాత మనసును గ్రహించలేకపోతుందామె. పెద్దకోడలు, చిన్నకోడలు తన మాట జవదాటరని గర్వపడుతూనే అప్పుడప్పుడైనా కళ్లతోనే తన ఉనికిని ప్రశ్నిస్తున్న సుజాత అంటే భయముంది ఆమెలో.

గాలి ఉండి ఉండి విసురుగా వీస్తోంది. గాలి వీచి నప్పడల్లా కనకమ్మ తన ఆచ్ఛాదన లేని ఎదను పైట కొంగుతో కప్పకుంటోంది. దేవాలయం గోడల మధ్య నుంచి వీస్తున్న పున్నాగపూల పరిమళాన్ని గాలి తనతో పాటు దేశమంతా తిప్పుతోంది. రాత్రి మత్తుగా ఊగు తుంది.

కనకమ్మ ఆలోచనలో పడింది.

తను కని పెంచి పెద్దచేసిన కొడుకు- కోడలు రాగానే ఆమె మాటే లోకంగా అయేడు. పెళ్లామే బెల్ల మన్న సామెత నిజం చేసేడు. పిల్లలు పుట్టగానే తమ స్వంత ప్రపంచాల్ని గిరి గీసుకుంటున్నారు ఇప్పటి వాళ్లు. వాడు పనిచేయటం లేదని వీడూ, వీడు కూర్చుని ఖర్చు ఎక్కువ పెడుతున్నాడని వాడూ, వాళ్ల పిల్లలు తమ పిల్లల్ని కొట్టేరని కోడళ్లు.

ఏ ఇంట్లో చూచినా ఇదే తంతు. తమ కాలంలో ఇవన్నీ ఎరుగుదురా వాళ్లు. పెద్దవాళ్లు ఎంత చెబితే అంత. మాట జవదాటే వాళ్లు కాదు. తను ఎన్ని ఉమ్మడి కుటుంబాల్ని చూడలేదు. అంతెందుకు. తన అత్తమాట తను ఎన్నడైనా జవదాటిందా?

కనకమ్మ గతాన్ని నెమరు వేసుకోవడంలో పడి చుట్ట పీల్చడం మర్చిపోయింది. అది ఎప్పడో ఆరిపో యింది. 'బక్ బక్'మని బలంగా పీల్చింది పొగ రాలేదు. చివర నలిపి చూచింది. ప్రయోజనం లేకపోయింది. ఆమె కర్ర తీసుకుని మూడో కోడల్ని కూడా తట్టిలేపింది.

"అమ్మాయ్! వసంతా! లేచి నాకు నిప్పెట్టె తెచ్చి ఇయ్యమ్మా," అంది.

వసంత లేచి వెళ్లి ఇంట్లోంచి అగ్గిపెట్టె తెచ్చి ఇచ్చింది. "వెళ్లి వాడిని లేపు. ఎప్పుడూ మొద్దు నిద్దరే సన్నాసికి," అగ్గిపుల్ల వెలిగించి చుట్ట కాల్చుకుంటూ అంది కనకమ్మ.

ఆ అమ్మాయి తటపటాయిస్తోంది.

"ఇంకా ఏమి సిగ్గే నీకు! పెళ్లై ఇన్నేళ్లయినా," అంటూ కర్రను బాగా పొడుగ్గా చాచి టకటకమని మూడో కొడుకు మంచమ్మీద తట్టి, "లేరా ఎదవా! లేచి ఇంట్లోకెళ్లు," అందామె.

వాడు ఒళ్లు విరుచుకుంటూ లేచి ఇంట్లోకి నడిచేడు. కనకమ్మ పెద్ద మనవరాలు నిద్రలో అటు తిరిగి పడుకుంది.

కనకమ్మ రాత్రి ఏ జామయిందోనని ఆకాశం చూచింది. చంద్రుడ్ని ఒక్క తెల్ల మేఘం కమ్మి వేసింది. పక్క మంచమ్మీదున్న మనవడు పక్క తడిపినట్టుంది. చిన్న చిన్న బొట్లు టపటపమని కిందకు కారుతున్నాయి.

తెల్లారితే కార్తీక సోమవారం.

ఆ ఇల్లు మూడు ముక్కలవుతుంది. చెట్టు అదే, కాయలు వేటికవే కదా! అనుకుందామె. పక్షికూనలు రెక్కలు రాగానే ఎగిరిపోయినట్లు మనుషులూ అంతేనేమో! తనున్నన్నాళ్లూ కొడుకుల్ని కలిపే ఉంచాలని ఆశ పడింది తను. ఏమైంది? రెండేళ్లనాడే వేరు కుంపట్లు పెట్టుకున్నారు. ఇప్పుడేమో ఇంటినే పంచేసుకుంటామంటున్నారు. తనకు అపురూపమైన ఇల్లు! తన ముందే చిందరవందరవుతోంది.

చుట్ట ఆఖరు దమ్ములాగి ఊసింది కనకమ్మ మంచం కింది నీళ్ల చెంబు అందుకుని పుక్కిలించి ఊసింది. కాసిని నీళ్లు తాగింది.

కోడలు తాళం చెవి ఇచ్చి వెళ్లి పడుకుంది.

మంచమ్మీంచి లేచి ఎద్దుల కట్టుమట్లోని తొక్కుడు తీసి బళ్లెగొడ్లకేసింది. వామిలోంచి వరిగడ్డి దూసి ఎద్దుల కట్టుమట్లో వేసింది. మళ్లీ వచ్చి పడుకుంది. నిద్రపట్టటం లేదామెకు. ఆలోచనలు ఎంతకూ తెగటంలేదు.

లేచి కూర్చుంది. మళ్లీ ఆకాశాన్ని చూచింది.

తొలికోడి కూసింది. ఒకదాని తర్వాత ఒకటి కోళ్లన్నీ కూసేయి. కొద్దికొద్దిగా ఊళ్లో సంచలనం మొదలైంది.

ఈ రెండు రోజుల ఆలోచనలు ఒక కొలిక్కి వస్తున్నాయి. ఒక నిశ్చయానికొచ్చినట్లు లేచి నిలబడింది.

ఇంటి తలుపు తాళం తీసి బుడ్డి వెలిగించింది. ఇల్లు నాలుగు వైపులా కలియతిరిగింది. గోడల్నీ కిటికీల్నీ తలుపునీ నిట్రాడునీ తడిమి తడిమి చూచింది. బయటికొచ్చి అందరి మంచాల దగ్గరా ఆగుతూ చూస్తూ నడిచింది. గొడ్లను చేరింది. ముసలి ఎద్దు తల నిమిరింది. అది ఘల్లుఘల్లుమని మువ్వల్ని మోగించింది. వేపచెట్టు మొదలు తాకింది. అది గలగలమని ఆకుల్ని రాల్చింది. దేవాలయ ధ్వజ స్తంభానికి దణ్ణం పెట్టుకుంది. చిరుగజ్జెలు మోగేయి.

మళ్లీ రెండో కొడుకు మంచం దగ్గరకు వెళ్లింది. "ఒరే అబ్బాయి! ఇంకా ఏం నిద్దరా! లే కోడికూసింది," అంది- వాడు కళ్లు నులుముకుంటూ లేచేడు. "బేపన పంతులు మళ్లీ ఎటన్నా పోతాడేమో! పోయి మంచి ముహూర్తం చూచి ఆ వేళకు రమ్మను," అంది. వాడు ఆశ్చర్యంగా తల్లిని చూచేడు.

సుజాత దగ్గరకెళ్లి తట్టిలేపి, "ఏందే పన్లన్నీ అట్టనే పెట్టుకుని ఇంకా నిద్దర! పిల్లల్ని స్కూలుకు పంపద్దూ" అంది. "బడికి సెలవులె," అందామె.

"సరె సరె! ఒరే పెద్దోడా! తోపులో కెళ్లి కాసిని మామిడాకులూ, కొమ్మలూ కొట్టుకురారా!" అప్పుడే లేస్తున్న పెద్దకొడుకుతో అందామె.

అందరూ ఆమెను ఆశ్చర్యంగా చూస్తున్నారు ఆ వేకువన.

*ఆహ్వానం మాసపత్రిక, సెప్టెంబర్ 1994*

